సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 26 । మే । 2024

'వంజంగి' సొగసు చూడతరమా!

విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందిన వంజంగిహిల్స్‌లో మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాతావరణంలో మార్పుల కారణంగా మంచు దట్టంగా కురుస్తోంది. ఈ ప్రాంతంలో మంచు అందాలు శనివారం ఉదయం 9 గంటల వరకు ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేశాయి. - సాక్షి, పాడేరు



న్యూస్‌రీల్

పోటెత్తిన పర్యాటకులు



రైల్వేస్టేషన్ నుంచి బయటకు వస్తున్న పర్యాటకులు, ప్రయాణికులు

అరకులోయ టౌన్: అరకులోయ, యండపల్లివలస రైల్వే స్టేషన్‌కు భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. వేసవి సెలవులు కావడంతో దూర ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో రావడంతో రైల్వేస్టేషన్లు రద్దీగా కనిపించాయి. అరకు పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి అందాలను తిలకించేందుకు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీల ర్యాలీ



లక్ష్మీపురంలో ర్యాలీ చేస్తున్న గిరిజనులు

ఎటపాక: మావోయిస్టులకు వ్యతిరేకంగా లక్ష్మీపురం గ్రామంలో ఆదివాసీలు శనివారం ర్యాలీ నిర్వహించారు. అమాయకపు గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో చంపడం, డబ్బులు వసూలు చేయమని ఒత్తిడి చేయడం వంటి దారుణాలకు మావోయిస్టులు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ఇటువంటి దుశ్చర్యలకు మావోయిస్టులు పాల్పడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని గిరిజనులు పేర్కొన్నారు.

ఏయూ డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో మొత్తం 27,603 మంది పరీక్షకు హాజరవగా 27,483 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో 99.57 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. బిఏ(సీబీసీఎస్)లో 99.68, బీబీఏ(సీబీసీఎస్)లో 98.66, బికాం(కంప్యూటర్స్)లో 99.71, బికాం(జనరల్)లో 99.92, బీహెచ్ఎంసీటీలో 100, బీఎస్సీలో 99.52, బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీలో 90, బీఎస్సీ ఫుడ్ సైన్స్‌లో 100, బ్యాచలర్ ఆఫ్ వెటర్నరీలో 100, బ్యాచలర్ ఆఫ్ ఒకేషన్‌లో 100 మంది ఉత్తీర్ణత సాధించారు.

వర్షానికి కోతకు గురైన డుడుమ రోడ్డు


- ప్రమాదభరితంగా ప్రయాణం



దాబుగూడ సమీపంలో వర్షానికి కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి డుడుమ వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన మార్గంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల రోడ్డు కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. ఇటీవల సెల్ టవర్ల నిర్మాణ పనుల నిమిత్తం రహదారి పక్కన తీసిన గోతుల కారణంగా రహదారి అంచు పటుత్వం కోల్పోయింది. భారీ వర్షానికి మూడు కిలోమీటర్ల రోడ్డులో అక్కడక్కడ అంచు కోతకు గురవడంతో వాహనచోదకులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. దాబుగూడ, సంగడ గ్రామాల సమీపంలో రోడ్డు బాగా దెబ్బతింది. వెంటనే మరమ్మతులు చేపట్టాలని వైస్ ఎంపీపీ భాగ్యవతి, వనుగుమ్మ సర్పంచ్ మిల్కి కోరారు. రోడ్డు కోతకు గురైన ప్రాంతాల్లో ప్రమాదాలకు గురికాకుండా స్థానికులు రాళ్లు అడ్డుపెట్టారు. ఇంత జరిగినా ఆర్‌అండ్‌బీ అధికారుల నుంచి స్పందన లేకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

మాచ్‌ఖండ్‌కు జలగండం!



ఎండిపోయిన జోలాపుట్టు స్పిల్‌వే జలాశయం తాజా చిత్రం



అడుగంటిన జోలాపుట్టు ప్రధాన జలాశయం తాజా చిత్రం

ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి కొరత నెలకొంది. వీటిపై ఆధారపడి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే మాచ్‌ఖండ్ ప్రాజెక్టుకు నీటి కొరత కారణంగా మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

- వెలవెలబోతున్న జోలాపుట్టు, డుడుమ జలాశయాలు
- విద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం
- వరుణుడు కరుణించకుంటే మనుగడ కష్టమే!

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి ప్రధాన ఆధారమైన జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో ఏటా జనవరి నుంచి జూన్ వరకు నీటి నిల్వలు నిండుకుంటున్నాయి. ప్రాజెక్ట్‌లో ఆరు జనరేటర్లు పనిచేస్తున్నా నీటి కొరత కారణంగా పూర్తిస్థాయిలో విద్యుత్‌ను ఉత్పత్తి చేయలేకపోతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి కొరత తీవ్రస్థాయిలో ఉన్నందున ఈ కేంద్రంలో ఉత్పత్తి ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి.

అడుగంటిన జలాశయం


జోలాపుట్టు ప్రధాన,స్పిల్‌వే జలాశయాల్లో పూర్తి స్థాయి నీటి మట్టం 2,750 అడుగులు. శనివారం నాటికి జోలాపుట్టు ప్రధాన జలాశయంలో 2709.80 అడుగులు మాత్రమే ఉంది. 2022లో ఇదే సమయానికి 2,723 అడుగుల మేర నీరు ఉండేది. 2023లో 2,704 అడుగులుగా నమోదు అయింది.

- జోలాపుట్టు జలాశయ నీటి మట్టంపై ఆధారపడి ఉన్న డుడుమ జలాశయంలో సైతం నీటి మట్టం ఆశించిన స్థాయిలో లేదు. దీని నీటి మట్టం 2590 అడుగులు కాగా ప్రస్తుతం 2,583 అడుగులు మాత్రమే ఉంది. ఈ జలాశయంలో నీటి స్థాయిని తగ్గకుండా కొద్ది రోజులుగా జోలాపుట్టు ప్రాజెక్టు నుంచి రెండు గేట్ల ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ క్రమబద్ధీకరిస్తున్నారు. ఇప్పటికే జోలాపుట్టు స్పిల్‌వే పూర్తిగా అడుగంటింది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవకపోతే జోలాపుట్టు ప్రధాన జలాశయం పూర్తిగా అడుగంటిపోయే పరిస్థితి పొంచి ఉంది.
- మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఆరు జనరేటర్ల సాయంతో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేయగలిగే సామర్థ్యం ఉంది. అయితే నీటి కొరత కారణంగా ప్రస్తుతం రెండు జనరేటర్ల ద్వారా 44 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. మూడేళ్ల క్రితం ప్రాజెక్ట్‌లో నీరు పుష్కలంగా ఉన్నా సాంకేతిక కారణాల వల్ల ఆరింటిలో రెండు, మూడు జనరేటర్లు మాత్రమే పనిచేసేవి. ఇప్పుడు అన్ని జనరేటర్లు అందుబాటులో ఉన్నా నీటి కొరత వల్ల పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయలేకపోతున్నాయి.
- డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటి మట్టాలు ఆశించిన స్థాయిలో లేనందున ఈ ఏడాది జనవరి నుంచి మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పాదన తగ్గుతూ వచ్చింది. 1995లో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్‌కు గత మూడేళ్లుగా నీటి కొరత నెలకొంది.

పూడిక సమస్యతో

జోలాపుట్టు, డుడుమ జలాశయాలు పూడిక సమస్యను ఎదుర్కొంటున్నాయి. వర్షాలు కురిసిన సందర్భంలో జలాశయాలోకి వచ్చే వరదనీటితోపాటు దుంగలు, చెత్త, మట్టి చేరుతోంది. దీని వల్ల రెండు జలాశయాల లోతు తగ్గిపోతోంది.

- జోలాపుట్టు జలాశయం చుట్టూ ఏర్పాటుచేసిన రాతికట్టు లోపలివైపు జారిపోయింది. ప్రస్తుతం నీరు లేకపోవడంతో బయటకు కనిపిస్తోంది. గతేడాది పూడిక సమస్యను గుర్తించిన జలాశయ అధికారులు, సిబ్బంది డుడుమ జలాశయంలో నీటిని పూర్తిగా విడుదల చేసి పూడిక తొలగించారు. జోలాపుట్టు జలాశయంలో మాత్రం తీయలేదు. దీనివల్ల ప్రాజెక్ట్‌లో నీటిమట్టం వివరాలు తేడా ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో భారీ వర్షాలు కురిస్తేనే గాని మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో శతశాతం ఉత్పత్తి జరిగే పరిస్థితి కనిపించడం లేదు.



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం



గతేడాది డుడుమ జలాశయంలో పూడిక తీత

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

- పాడేరు, అరకు అసెంబ్లీకి ఏర్పాట్లు వేగవంతం
- ప్రతీ హాల్‌లో 14 టేబుళ్లు
- కట్టుదిట్టమైన భద్రత
- జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత
- అధికారులకు ఆదేశాలు



పాడేరు డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ ఎం.విజయసునీత, చిత్రంలో పీవో చైతన్య, డీఆర్వో పద్మావతి

సాక్షి, పాడేరు: పాడేరు, అరకు అసెంబ్లీకి సంబంధించి వచ్చే నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించేందుకు త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు. రోజువారి తనిఖీల్లో భాగంగా శనివారం ఆమె స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. అనంతరం పాడేరు, అరకులోయ కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి, ఏజెంట్లకు వేర్వేరుగా ఎంట్రీలు ఉండాలని ఆదేశించారు. కౌంటింగ్ ఏజెంట్లు ఎట్టి పరిస్థితులలోను కౌంటింగ్ టేబుళ్ల వద్దకు వెళ్లకుండా వారికి కేటాయించిన స్థలంలో ఉండి పర్యవేక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐరన్ మెస్ పనులను పూర్తి చేయాలని, సీసీ కెమెరాల వ్యవస్థను పూర్తిస్థాయిలోకి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతీ కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లను ఏర్పాటు చేయాలని, ప్రతి ప్రదేశంలోను అవసరమైన విద్యుత్ లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఆవరణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న భవనంలో మీడియా సెంటర్ ఏర్పాటు పనులు వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అరకు ఆర్వో వి.అభిషేక్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, డీఆర్వో పద్మావతి, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు,డీఈఈ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

జలపాతంలో యువకుడు గల్లంతు

స్నేహితులతో కలిసి సెల్ఫీ తీసుకుంటుండగా ప్రమాదం



పిట్టలబొర్ర జలపాతం

పెదబయలు: స్నేహితులతో కలిసి సెల్ఫీ తీసుకుంటుండగా ఓ యువకుడు జలపాతంలో కాలుజారిపడి గల్లంతయ్యాడు. మండలంలోని గిన్నెలకోట పంచాయతీ పిట్టలబొర్ర జలపాతం వద్ద శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. అరకులోయకు చెందిన సుమారు పది మంది స్నేహితులు ప్రత్యేక వాహనంలో జలపాతం వద్దకు వచ్చారు. వీరంతా ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈ సమయంలో వీరిలో అరకులోయ మండలం మాడగుడ పంచాయతీ దొరగుడకు చెందిన సమరెడ్డి వేణుగోపాల్ (24) కాలుజారి జలపాతంలో పడి గల్లంతయ్యాడు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారాన్ని వారు స్థానికులకు తెలియజేశారు. అయితే యువకుడు గల్లంతైన ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉన్నందున దిగేందుకు ఎవరూ సాహసించలేకపోయారు. దీనిపై ఎస్‌ఐ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదం జరిగినట్టు తెలిసిందన్నారు. అయితే బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆయన పేర్కొన్నారు. శనివారం రాత్రి వరకు వేణుగోపాల్ ఆచూకీ లభ్యం కాలేనట్టు తెలిసింది.



ప్రమాదానికి గురైన సమరెడ్డి వేణుగోపాల్

రైతులు, రైతు ఉత్పత్తిదారుల

సంఘాలకు ప్రోత్సాహం

ఏపీ ఆహార శుద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుభాష్



తయారు చేస్తున్న ఉత్పత్తులను పరిశీలిస్తున్న పీడీ సుభాష్

చింతపల్లి రూరల్: వ్యవసాయ మార్కెటింగ్‌కు అనుబంధంగా పనిచేస్తున్న రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం అందిస్తున్నట్టు ఏపీ ఆహార శుద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సుభాష్ అన్నారు. మండలంలో శనివారం లంబసింగిలో పర్యటించిన ఆయన రాజుపాకలు కేంద్రంగా పనిచేస్తున్న లంబసింగి ట్రైబల్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని సందర్శించారు. అక్కడ తయారు చేస్తున్న పనస పచ్చడి, చిప్స్, జామ్, జ్యూస్ తదితర ఉత్పత్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు సంస్థ ద్వారా 5,200 మంది రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహకాలు అందించామన్నారు. చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు అవసరమైన నిధులు ఎంఐడీహెచ్ ద్వారా 30 శాతం రాయితీపై సమకూర్చినట్లు ఆయన తెలిపారు. గిరిజన రైతులు పండించిన, సేకరించిన వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు అనువుగా కలెక్షన్ సెంటర్లు, ప్రొసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. తాజాగా జిల్లాలో విద్యుత్ ఆధారంగా పనిచేసే 250 కాఫీ బేబీ మినీ పల్పర్లు రాయితీపై అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ నెస్ట్ ఎండీ రాజేష్, జి.మాడుగుల, వంట్లమామిడి, లంబసింగి ప్రాంతాలకు చెందిన ఎఫ్‌పీవోల డైరెక్టర్లు సరోజా, ఇందిర పాల్గొన్నారు.

రేపటి నుంచి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత



సాక్షి,పాడేరు: పాలిసెట్–2024లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 27 నుంచి ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశామని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత తెలిపారు. ఈనెల 27న ర్యాంక్ 01 నుంచి 12,000, 28న 12,001 నుంచి 27,000, 29న 27,001 నుంచి 43,000, 30న 43,001 నుంచి 59,000, 31న 59,001 నుంచి 75,000, జూన్ ఒకటిన 75,001 నుంచి 92,000, రెండున 92,001 నుంచి 1,08,000, 3న 1,08,001 నుంచి ఇతర ర్యాంకుల అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తామని తెలిపారు. అలాగే ఈనెల 31 నుంచి వచ్చే నెల ఐదు వరకు వెబ్ అప్షన్‌లో ఆన్‌లైన్ ఎంపిక కార్యక్రమం కూడా ఉంటుందన్నారు.అభ్యర్థులు ఏపీ పాలిసెట్ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాలని సూచించారు. అభ్యర్థులు టెన్త్ మార్కుల జాబితా, 4వతరగతి నుంచి టెన్త్ వరకు స్టడీ ధ్రువపత్రాలు, టీసీ ఒరిజినల్, ఆధార్‌కార్డు, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన రశీదు, పాలిసెట్–2024 హాల్ టికెట్, ర్యాంకు కార్డు జిరాక్స్ కాపీలతో అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని కోరారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రంలో ఈకార్యక్రమం నిర్వహిస్తామని ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని ఆమె కోరారు.

గిరిజనులకు జాక్ ఫ్రూట్

పనస విరగ్గాయడంతో మంచి ఆదాయం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో ప్రస్తుత వాతవరణ పరిస్థితులు అనుకూలించడంతో పనసచెట్లు విరగ్గాశాయి. మార్కెట్లో ధర కూడా బాగుండటంతో గిరిజనులు మంచి ఆదాయం పొందుతున్నారు. సైజును బట్టి ఒకొక్క పండు రూ.50 నుంచి రూ.70కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రిటైల్‌గా రూ.వంద నుంచి రూ.200కు విక్రయిస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన పనసపండ్లను వ్యాపారులు హైదరాబాద్, విజయవాడ, తాడేపల్లిగూడెం, విజయనగరం,రాజమహేంద్రవరం, విశాఖ, గాజువాక, తుని ప్రాంతాలకు తరలిస్తున్నారు.



జి.మాడుగుల మండలం బందవీధిలో విరగ్గాసిన పనసచెట్టు

క్లుప్తంగా

వెంకన్నకు మామిడి నివేదన


మామిడి పండ్లతో వెంకన్న

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శని వారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, అనంతరం తోమాల సేవ, అష్టోత్తర నామార్చన, సహస్ర నామార్చన జరిగింది. తదుపరి 1008 మామిడి ఫలాలతో స్వామిని పూజించారు. సాయంత్రం నవ హారతులతో దీపోత్సవం చేశారు. రాత్రి పవళింపు సేవ నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కంచరపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్, 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలో 3, అనకాపల్లి జిల్లా పరిధిలో 8 గురుకులాల్లో మిగులు సీట్లు భర్తీ చేస్తామన్నారు. 5వ తరగతిలో బాలుర అడ్మిషన్ కోసం 28వ తేదీ కంచరపాలెంలోని జిల్లా సమన్వయాధికారి కార్యాలయంలో, బాలికల అడ్మిషన్ కోసం 29వ తేదీ తాళ్లపాలెం అంబేడ్కర్ గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆమె కోరారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలుర అడ్మిషన్ కోసం 30వ తేదీ సబ్బవరం గురుకులంలో, బాలికలకు 31న మేహాద్రి గెడ్డ గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందని, తగిన ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

సైనిక్ స్కూల్‌కు ముకుందపురం విద్యార్థి ఎంపిక


పోట్ల శ్రీరామ్ రాకేశ్

మాడుగుల రూరల్ : ముకుందపురం గ్రామానికి చెందిన పోట్ల శ్రీరామ్ రాకేశ్ సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గల సైనిక స్కూల్‌కు ఎంపికయ్యాడు. శ్రీరామ్ రాకేశ్ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చోడవరంలో ఒక ప్రైవేటు స్కూల్లో చదివాడు. 6 నుంచి 9 వ తరగతి వరకు తెనుగుపూడి గురుకుల పాఠశాలలో చదువుతూ ఈ ఏడాది జనవరి 28న విశాఖలో జరిగిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. త్వరలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరవ్వాలని ఉత్తరప్రదేశ్ నుంచి సమాచారం వచ్చిందని రాకేశ్ తల్లిదండ్రులు పోట్ల వీర్రాజు, వీరాలక్ష్మి శనివారం తెలిపారు. వీర్రాజు తాపీ మేస్త్రీగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. సామాన్య కుటుంబంలో జన్మించిన రాకేశ్ మంచి ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు, కుటుంబ సభ్యులు రాకేశ్‌ను అభినందించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టపంజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాల జలమయం

పెదబయలులో డ్రైనేజీ లేక ఎగదన్నిన వరదనీరు


డుంబ్రిగుడ ప్రాంతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ


పెదబయలులో కురుస్తున్న భారీ వర్షం


పెదబయలులో నిలిచిపోయిన వరదనీరు

అరకులోయ టౌన్/డుంబ్రిగుడ/పెదబయలు: మండలాల్లో శనివారం భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పెదబయలులో గ్రంథాలయం వీధిలో వర్షం నీరు మోకాళ్ల లోతున చేరింది. వరదనీరు పోయేందుకు డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బాలికపై కేజీహెచ్ ఉద్యోగి లైంగిక వేధింపులు

దాబాగార్డెన్స్: దళిత బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేజీహెచ్ ఉద్యోగి దిలీప్‌పై వన్‌టౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. పోక్సో కేసు విషయమై వైద్య పరీక్షల కోసం ఆరిలోవ పోలీస్‌స్టేషన్ నుంచి కేజీహెచ్ గైనిక్ వార్డుకు వచ్చిన బాలిక పట్ల అక్కడ పనిచేస్తున్న దిలీప్ అనుచితంగా ప్రవర్తించాడు. సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించాడు. ఈ విషయమై ఆ బాలిక తన తల్లిదండ్రుల వద్ద మొర పెట్టుకుంది. వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆరిలోవ స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదు అవ్వడంతో జీరో ఎఫ్ఐఆర్ ఫైల్ చేసి.. వన్‌టౌన్ పోలీసులకు బదిలీ చేశారు. వన్‌టౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి.. దిలీప్‌ను రిమాండ్‌కు తరలించారు.

క్రీడా మైదానం ఆక్రమణపై ఫిర్యాదు


రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా స్థలాన్ని ఆక్రమిస్తూ కంచె వేసిన దృశ్యం

రాజవొమ్మంగి : స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాస్థలం ఆక్రమణలకు గురవుతున్నట్టు తెలిసిన 40 మంది పూర్వ విద్యార్థులు శనివారం ఆ చర్యలను అడ్డుకొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పాఠశాలకు దాదాపు 5 ఎకరాల విస్తీర్ణంలో క్రీడాస్థలం ఉంది. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో, ఈ స్థలంపై కన్నేసిన కొంత మంది స్థలాన్ని ఆక్రమించేందుకు రాత్రికి రాత్రి ముళ్ల కంచె వేశారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న పాఠశాలకు చెందిన సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, సర్వేయర్లు అప్పన్నరెడ్డి, రాంబాబులు పాఠశాలకు వెళ్లి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. భూకబ్జా ఆక్రమణకు పాల్పడుతూ వేసిన కంచెలను వెంటనే తొలగించాలని ఆక్రమణదారులను హెచ్చరించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి పాఠశాల స్థలానికి సరిహద్దులు ఏర్పాటు చేస్తామని విలేకరులతో చెప్పారు.

కేకే లైన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు


శివలింగపుపురం యార్డ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శనివారం కేకే లైన్ పరిధి శివలింగపురంలో తనిఖీలు నిర్వహించారు. ఈ స్టేషన్‌లో జరుగుతున్న భద్రతా పనులను పరిశీలించారు. సిగ్నలింగ్, ట్రాక్‌ల పెంపు, పాయింట్స్, క్రాస్ ఓవర్స్, ఓవర్ హెడ్ ఎలక్ట్రిఫికేషన్ వంటి పనులను పరిశీలించారు. ఈ ప్రాంతంలో నిత్యం జరిగే ఇనుప ఖనిజ రవాణాను దృష్టిలో ఉంచుకుని, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని డీఆర్‌ఎం సూచించారు. ఈ పర్యటనలో డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ విజేంద్ర కుమార్, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్ దీప్తాన్షు శర్మ, సీనియర్ డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (ట్రాక్షన్) పండి టాం, సీనియర్ డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఆపరేషన్స్ ఎస్.పర్వతం, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

జంతు సంరక్షణ చట్టం నోడల్ అధికారిగా ఏసీపీ శ్యామలరావు

విశాఖ సిటీ: విశాఖలో జంతువులపై నేరాలు, జంతు సంరక్షణ చట్టాల అమలకు నోడల్ అధికారిగా జోన్–2 ఏసీపీ(క్రైమ్) సిహెచ్.శ్యామలరావు నియమితులయ్యారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఈ నియామకానికి సంబంధించి ఉత్తర్వులు ఇచ్చారు. దీనిలో భాగంగా ఏసీపీ శ్యామలరావు కమిషనరేట్ పరిధిలో ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ, జంతు సంరక్షణ చట్టాలు సమర్థవంతంగా అమలయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంలో జంతు అక్రమ రవాణా, జంతు వధ నియంత్రణతో పాటు జంతు చట్టాలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పండగల సీజన్లలో జంతువులను వధించడానికి రాష్ట్ర హైకోర్టు మార్గదర్శకాలతో స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు కేరాఫ్ ఆర్‌జీయూకేటీ

- అందుబాటులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య
- గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు మంచి అవకాశం
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రవేశాల్లో నాలుగు శాతం డిప్రెవేషన్ స్కోర్
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం ..జూన్ 25 ఆఖరు తేదీ

సాక్షి, విశాఖపట్నం: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్‌జీయూకేటీ)లు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యకు చిరునామాగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల ఉన్నత విద్య కలను సాకారం చేస్తూ వారు అత్యున్నత స్థానాల్లో కొలువులు సాధించేందుకు ఆసరాగా ఉంటున్నాయి. 10వ తరగతి మార్కుల ఆధారంగా ఇందులో ప్రవేశాలు లభిస్తాయి. రాష్ట్రంలో నాలుగు క్యాంపస్‌లు శ్రీకాకుళం, ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలులో ప్రవేశాలకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఒక్కో క్యాంపస్‌లో 1100 సీట్లు (ఎకనామికల్లీ బ్యాక్ వర్డ్ క్లాసెస్ రిజర్వేషన్ కలిపి) అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు నాలుగు శాతం డిప్రెవేషన్ స్కోర్ ఇస్తారు. 10వ తరగతి మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, స్కాట్, ఆంగ్లో ఇండియన్, దివ్యాంగులు వంటి ప్రత్యేక కోటాలు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అత్యుత్తమ విద్య : ఆర్‌జీయూకేటీలో ఆరేళ్ల చదువుకునే అవకాశం లభిస్తుంది. రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు, నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సు చదువుకోవచ్చు. లేదంటే పీయూసీ పూర్తిచేసి రిలీవ్ కావచ్చు. పీయూసీ అనంతరం ఇంజినీరింగ్‌లో కొనసాగవచ్చు. సీఎస్‌ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ, ఐటీ వంటి బ్రాంచ్‌తో పాటు ఇడుపులపాయ, నూజివీడుల్లో ప్రత్యేక బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. ఆర్‌జీయూకేటీలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఉన్నత విద్యకు సంబంధించిన గేట్ వంటి ర్యాంకులు సాధిస్తున్నారు. కొందరు విద్యార్థులు ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ వంటి అత్యున్నత ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. పరిశ్రమల్లో మంచి ప్యాకేజీలకు సైతం సాధిస్తున్నారు.

జూలై 11న జాబితా..

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల కాగా, 8వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. జూన్ 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జూలై 11న ఎంపికైన వారి జాబితా విడుదల చేస్తారు. జూలైలో ప్రవేశాలు పూర్తిచేసి, ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

రెసిడెన్షియల్ విధానంలో బోధన

ఏడాదికి పీయూసీ ఫీజు స్ట్రక్చర్ రూ.45 వేలు కాగా, ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.50 వేలు, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు రూ.1.50 లక్షలుగా నిర్ణయించారు. అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు లభిస్తాయి. తెలుపు రేషన్ కార్డు ఉన్న కుటుంబాల పిల్లలకు ఉచితంగా విద్య లభిస్తుంది. పూర్తిగా రెసిడెన్సియల్ విధానంలో బోధన జరుగుతుంది.

కెమికల్ ఇంజినీరింగ్‌లో విస్తృత అవకాశాలు


డిప్యూటీ రిజిస్ట్రార్ స్వరూపారాణి, ప్రిన్సిపాల్ వెంకటరమరణతో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

మురళీనగర్ : కెమికల్ ఇంజినీరింగ్‌లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని అనకాపల్లి జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఏ.పీ స్వరూపారాణి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం జాబ్ అఛీవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒక విద్యా సంవత్సరంలో గైస్ నుంచి వంద మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ హెచ్‌ఆర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రెడ్డిపల్లి శ్రీనివాస్, ఆంధ్రా పెట్రోకెమికల్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ కంపెనీల తరపున విద్యార్థులు ఇండస్ట్రియల్ శిక్షణకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో తమ కాలేజీ నుంచి వందమందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. అత్యధికంగా రూ.4 లక్షల వార్షిక ప్యాకేజీతో నలుగులు విద్యార్థులు ఉద్యోగాలు సాధించగా ఆంధ్రా పెట్రో కెమికల్స్‌లో 26 మంది రూ.3.6 లక్షలు, ఐటీసీ భద్రాచలంలో ఆరుగురికి రూ.3.82 లక్షలు వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామక ఉత్తర్వులను డిప్యూటీ రిజిస్ట్రార్ ఏపీ స్వరూపారాణి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ రిటైర్డ్ పీఆర్‌వో శర్మ, గైస్ పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు, బెల్ రిటైర్డ్ సేఫ్టీ ఆఫీసర్ ఎ.వరహాలు, కాలేజీ హెచ్‌వోడీలు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, ఎస్.ప్రశాంత కుమారి పాల్గొన్నారు.